


వీరులగుడికి వీరాచారులు రాక

కారెంపూడి: పల్నాటి రణక్షేత్రం కారెంపూడిలో ఉన్న పల్నాటి వీరుల గుడికి వివిధ ప్రాంతాల నుంచి వీరాచారులు ఆదివారం తరలివచ్చారు. ప్రత్యేక పూజలు చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం ఆదివారం 538.50 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 10,000 క్యూసెక్కులు విడుదలవుతోంది.

తేజోరూపిణిగా బగళాముఖి



చందోలు(కర్లపాలెం): గ్రామంలో వేంచేసి యున్న శ్రీ బగళాముఖ అమ్మవారు ఆదివారం భక్తులకు తేజోరూపిణిగా దర్శనమిచ్చారు. మాఘమాసం ఆలయ సాంప్రదాయం ప్రకారం అర్చనలు విశేష పూజలు జరిగాయి.

న్యూస్‌రీల్

సూర్య భగవానునికి 241 పాత్రలతో పాయసం నివేదన



మంగళగిరి టౌన్: మంగళగిరి శ్రీ లక్ష్మీ నరసింహస్వామి కల్యాణ వేదిక ప్రాంగణంలో మాఘ మాసాన్ని పురస్కరించుకుని ఆదివారం సూర్య భగవానుడికి వాసవీ క్లబ్, వాసవీ పరివార్, ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య మహిళా సభ విభాగాల ఆధ్వర్యంలో 241 పాత్రలతో పాయసంతో సూర్య భగవానుడికి నివేదన సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ ఆవు పాలు, పిడకలతో ఏక కాలంలో శ్రీ సూర్యనారాయణస్వామికి పాయసం వండి నివేదించడం ఎంతో శుభ ప్రదమని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు, కృష్ణా జిల్లాల నుంచి ఎంతోమంది మహిళలు పాల్గొన్నారని నిర్వాహకులు తెలియజేశారు. సూర్య భగవానుడికి ఇష్టమైన రోజు ఆదివారమని, ఆ రోజున తలపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతమైందని పేర్కొన్నారు. ప్రోగ్రాం ఆర్గనైజర్, కో–ఆర్డినేటర్ సుజాత, రామకృష్ణ పాల్గొన్నారు.

'రాష్ట్ర సమ్మాన్' పురస్కారం ప్రదానం



తెనాలి: తెలంగాణ ప్రభుత్వ సాంస్కృతిక శాఖ సహకారంతో సంస్కృతి కళాక్షేత్ర ఇంటర్నేషనల్ కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని జీపీ బిర్లా సైన్స్ ఆడిటోరియంలో జరిగిన భారత్ ఉత్సవ్–2025లో తెనాలికి చెందిన చిన్నారి మేధావి బండికళ్ల ప్రదీప్ నారాయణకు 'రాష్ట్ర సమ్మాన్' అవార్డును ప్రదానం చేశారు. తెలంగాణ రాష్ట్రానికి చెందిన కళా, సాంస్కృతిక రంగాల ప్రముఖులు హాజరై చిన్నారిని అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ఘనతలు సాధించాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు. ఏడాదిన్నర వయసు నుంచే అద్భుత జ్ఞాపకశక్తిని ప్రదర్శిస్తున్న ప్రదీప్‌నారాయణ మూడేళ్ల వయసులో జాతీయ గీతాన్ని 52 సెకన్లలో ఆలపిస్తున్నాడు. పండ్లు, కూరగాయలు, మనిషి శరీర భాగాలు వంటివి 500 పైగా గుర్తిస్తున్నాడు. తెలంగాణ 'రాష్ట్ర సమ్మాన్' సహా ఇప్పటికి ఎనిమిది జాతీయ పురస్కారాలు, అంతర్జాతీయ స్థాయిలో పది అవార్డులు అందుకున్నాడు.

కస్టమ్స్ అధికారులు అవయవదానం



లక్ష్మీపురం: కస్టమ్స్ డే వేడుకలలో భాగంగా కస్టమ్స్, జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి దంపతులు అవయవదానం చేశారు. విజయవాడలో శనివారం నిర్వహించిన వేడులలో ఆయన మాట్లాడుతూ బాక్స్ ఆఫ్ కైన్డ్ నెస్ స్థాపకులు ఒకే రోజు 4 వేల మందితో రక్తదానం చేయించారని అభినందించారు. ప్రతిఒక్కరు సేవాభావం, మానవత్వం కలిగి ఉండాలన్నారు. తాను, తన సతీమణి అవయవదానం చేస్తున్నట్లు ప్రకటించారు. దీంతో ప్రాంగణంలో ఉన్న కస్టమ్స్ శాఖ అధికారులు 36 మంది కూడా అవయవదానం చేస్తూ అంగీకారపత్రం ఇచ్చారు. సెప్క్ చైర్‌పర్సన్ సీతా మహాలక్ష్మి మాట్లాడుతూ ఇంతమంది అవయవదాతలుగా నమోదు కావడం సంతోషకరంగా ఉందన్నారు.

డాక్టర్ ప్రజ్ఞాచారికి 'కళా కిరీటి' అవార్డు



తెనాలి: రూరల్ మండలంలోని కొలకలూరు గ్రామానికి చెందిన సాహితీవేత్త డాక్టర్ నూతక్కి పూర్ణ ప్రజ్ఞాచారికి గోదావరి కల్చరల్ అసోసియేషన్ కళా కిరీటి జాతీయ పురస్కారాన్ని అందజేసింది. ఆంధ్రప్రదేశ్ అసోసియేషన్ పంచమ వార్షికోత్సవ సందర్భంగా ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన కవులను గుర్తించి ఈ గౌరవాన్ని అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా పాలకొల్లు నియోజకవర్గం పరిధిలోని మలికిపురంలోని అల్లూరి సత్యనారాయణరాజు ఫంక్షన్ హాలులో ఆదివారం కళా కిరీటి జాతీయ పురస్కారాలను బహూకరించారు.

కూటమి కుట్ర
ఇంటింత కాదయా..!

- లబ్ధిదారుల మెడలపై కూటమి కత్తి
- మార్చి 31లోగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించకపోతే స్థలాలు స్వాధీనం
- ప్రచారం చేస్తున్న కూటమి నాయకులు
- బెంబేలెత్తుతున్న లబ్ధిదారులు

అనర్హుల పేరుతో ఇళ్లు రద్దు చేసే యోచన

నరసరావుపేట: జిల్లాలోని పలు ప్రాంతాల్లో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైఎస్సార్ జగనన్న కాలనీల్లోని (నూతన పీఎంఏవై, ఎన్‌టీఆర్ నగర్ స్కీము) లబ్ధిదారుల మెడలపై కూటమి ప్రభుత్వం కత్తి వేలాడతీసింది. ఈ మార్చి 31వ తేదీలోగా ఇళ్లు నిర్మించుకోని వారి స్థలాలు స్వాధీనం చేసుకుంటామని కూటమి నాయకులు చేస్తున్న ప్రకటనలతో బెంబేలెత్తిపోతున్నారు. అధికారంలోకి వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ఒక్క ఇల్లుకూడా మంజూరుచేయని ప్రభుత్వం ఇళ్ల స్థలాలు పొందిన వారికి పార్టీలు అంటగట్టి ఇబ్బందుల పాలు చేసేందుకు ప్రయత్నాలు చేస్తుంది.

పేదల కోసం కాలనీలు ఇలా..

పేదలకు సొంత ఇంటి కలను నెరవేర్చాలనే దృక్పధంతో అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైఎస్సార్ జగనన్న కాలనీలకు రూపకల్పన చేశారు. జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో 16



వినుకొండరోడ్డు జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణాలు చేయని ఖాళీ ప్రదేశం

ప్రదేశాల్లో 39,625మందికి వేల ఎకరాల ప్రైవేటు భూమి కొనుగోలు చేసి ఒక్కొక్కరికి సెంటు చొప్పున ఇళ్ల పట్టాలతో పాటు గృహాలు కేటాయించింది. ప్రతి పట్టాను మహిళ పేరుతో ఇవ్వటమే గాకుండా ఐదేళ్ల అనంతరం వాటిని విక్రయించుకునే సౌలభ్యాన్ని కూడా కల్పించింది. వారిపేరుపై ఒక్క రూపాయి ఖర్చుతో రిజిస్ట్రేషన్ చేసింది. దీనిలో ఇంటి నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస యోజన పథకం కింద ఇచ్చే రూ.1.50లక్షలకు తోడుగా తాను రూ.30వేలు అదనంగా ఇవ్వటంతో పాటు ఇసుక, సిమెంట్, స్టీలు ఉచితంగా అందజేశారు.



వినుకొండరోడ్డు జగనన్న కాలనీలో ఓ లబ్ధిదారు బేస్‌మెంట్ వరకు నిర్మాణం చేసి ఆపేసిన దృశ్యం

ఇసుక లభ్యత గగనం.. ఇంటి నిర్మాణం కష్టం



అందజేసిన స్థలాల్లో 14,042 గృహాలు మాత్రమే పూర్తయ్యాయి. అసలు 8455 స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలే మొదలు కాకపోగా, మిగతా వాటిలో బేస్‌మట్టం స్థాయి నుంచి రూఫ్ లెవల్ వరకు వివిధ దశల్లో గృహాలు ఉన్నాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం లబ్ధిదారులకు ఎటువంటి చేయూత అందించకపోవటంతో వారిలో నిస్తేజం ఏర్పడింది. ప్రభుత్వ అస్తవ్యస్త విధానంతో లబ్ధిదారులకు ఇసుక దొరకటమే కష్టంగా మారింది. దీంతో పాటు గత ప్రభుత్వం పేదలకు అందజేసిన ఏ ఒక్క పథకం అమలుచేయకపోవటంతో చేతిలో చిల్లిగవ్వ కన్పించటం కష్టంగా మారింది. దీంతో ఇంటి నిర్మాణం తలకు మించిన భారంగా పరిణమించింది. ఈ నేపధ్యంలో వచ్చే మార్చి లోగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించని 8455 మంది లబ్ధిదారుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. కాగా, ఇటీవల కాలనీని సందర్శించిన రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారధి మాట్లాడుతూ లబ్ధిదారులు వచ్చే 2026 డిసెంబర్ నాటికి ఇళ్ల నిర్మాణం పూర్తిచేసుకోకపోతే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.1.50లక్షలు రావని చెప్పటం గమనార్హం.

అది మా పనికాదు



ఇళ్ల కోసం ఇచ్చిన స్థలాలు వెనక్కి తీసుకునే హక్కు మాకు లేదు. అది మా గృహనిర్మాణశాఖ పని కాదు. మాకు ఎటువంటి ఆదేశాలు రాలేదు. లబ్ధిదారులను మార్చి 31లోగా ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించుకోవాలని కోరుతున్నాం.

– ఎస్. వేణుగోపాలరావు, పీడీ, గృహనిర్మాణశాఖ

పోరాటం చేస్తాం..

పేదలు తమకు ఇచ్చిన స్థలాల్లో ఇళ్లు కట్టుకునేందుకు కావాల్సిన నిధులను ప్రభుత్వమే ఇవ్వాలి. ప్రభుత్వం వచ్చీరాగానే ఇళ్ల నిర్మాణం చేసుకోని వారి స్థలాలు స్వాధీనం చేసుకుంటామంటూ ప్రకటనలు ఇవ్వటం ఏమాత్రం సముచితం కాదు. ప్రభుత్వం ఇచ్చే రూ.1.50లక్షలు బేస్‌మెంట్ స్థాయికే సరిపోతుంది. కనీసం రూ.5లక్షలు సాయం చేస్తేనే నేటి ధరలు, కూలీకి ఇల్లు ఏర్పడుతుంది. ఈవిధంగా సహాయం చేయకుండా లబ్ధిదారులను ఇబ్బందిపెడతామంటే వారిని కూడగట్టుకొని పోరాటం చేస్తాం.

– షేక్ శిలార్ అహ్మద్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి

పండితులను తీర్చిదిద్దిన సంస్కృత కళాశాల

డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు



తెనాలి: చరిత్రపుటల్లో తెనాలి సంస్కృత కళాశాల చిరస్మరణీయంగా నిలిచిపోతుందని రామాయణ ప్రవచన సుధాకర, సంస్కృత కళాశాల విశ్రాంత ప్రధాన ఆచార్యులు డాక్టర్ మైలవరపు శ్రీనివాసరావు అన్నారు. శతాధిక వసంతాలు నడిచిన తెనాలిలోని కోట లక్ష్మయ్యనాయుడు సంస్కృత కళాశాల పూర్వవిద్యార్థుల సంఘం ప్రథమ వార్షికోత్సవం ఆదివారం సాయంత్రం స్థానిక రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ హాలు లో ఘనంగా నిర్వహించారు. పూర్వవిద్యార్థులు, అధ్యాపకుల జ్ఞాపకాలతో రూపొందించిన ప్రత్యేక సంచిక 'మనోరమ'ను ఆవిష్కరించారు. కళాశాల పూర్వ విద్యార్థి, ఆగమ పండితుడు మామిళ్లపల్లి మృత్యుంజయప్రసాద్ అధ్యక్షత వహించారు. సంఘం కన్వీనర్ పి.వినాయకరావు, దేవయజనం మురళీకృష్ణ, ఈఎల్‌వీ అప్పారావు, చిలుమూరు రామలింగేశ్వరరావు కె.శ్రీనివాస్ శర్మ, మేడూరు శ్రీనివాసమూర్తి, ఎ.సూర్యనారాయణ, జయప్రద, ఎం.సుధారాణి, సద్యోజాతం శేషవీరేశ్వర శర్మ, ఎం.సత్యనారాయణ శాస్త్రి, లక్ష్మీనరసింహారావు, జె.అరుణ గోపాలాచార్యులు మాట్లాడారు.

పూర్వజన్మ సుకృతం

కళాశాల పూర్వ విద్యార్థిని, తెలుగు సంస్కృత అకాడమీ మాజీ చైర్‌పర్సన్ నందమూరి లక్ష్మీపార్వతి మాట్లాడుతూ... ఈ కళాశాల తనకు భాషా పరిజ్ఞానాన్ని, సంస్కారాన్ని అందించిందని చెప్పారు. సంస్కృత కళాశాలలో చదవడం తన పూర్వజన్మ సుకృతమన్నారు. ఉత్తమ జ్ఞానాన్ని, నడవడికను కూడా పొందగలిగామని పేర్కొన్నారు. మూతబడిన కళాశాలను కనీసం సాహిత్యానికి సంబంధించిన ఉత్తమ గ్రంథాలయంగా రూపొందిస్తే సమాజానికి ఎంతగానో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. అందుకు తన వంతు సహాయం అందిస్తామన్నారు.

జీబీ సిండ్రోమ్ కలకలం



- గుంటూరు జీజీహెచ్‌లో బాధితురాలి మృతి
- ప్రతినెలా సగటున 10 నుంచి 15 మందికి చికిత్స
- సత్వర వైద్యసేవలు అందిస్తుండటమే కారణం
- భయపడాల్సిన పనిలేదంటున్న వైద్య నిపుణులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలో జీబీ సిండ్రోమ్ (గులియన్‌బెరి సిండ్రోమ్) కలకలం రేపుతోంది. తాజాగా గుంటూరు జీజీహెచ్‌లో ఆదివారం ప్రకాశం జిల్లా అలసానిపల్లెకు చెందిన బి.కమలమ్మ(45) చికిత్స పొందుతూ మృతి చెందింది. జీబీ సిండ్రోమ్‌తో ఈ నెల 3న జీజీహెచ్ న్యూరాలజీ వార్డులో అడ్మిట్ అయి వెంటిలేటర్‌పై చికిత్స పొందుతూ ఆదివారం కార్డియాక్ అరెస్ట్‌తో చనిపోయింది. వాస్తవానికి ప్రతినెలా గుంటూరు జీజీహెచ్‌లో పది మందికిపైగా ఈ వ్యాధి బాధితులు చికిత్స పొందుతున్నారు. రాష్ట్రంలో పలు జిల్లాలకు చెందిన బాధితులు వారు గుంటూరు జీజీహెచ్‌కు తరలి వస్తున్నారు. ఇతర జిల్లాలతో పోలిస్తే జీజీహెచ్‌లో జీబీ సిండ్రోమ్ కేసులకు న్యూరాలజీ వైద్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని చికిత్స అందిస్తూ ప్రాణాలు కాపాడుతున్నారు. ఖరీదైన ఇంజక్షన్‌లను తక్షణమే ఇస్తున్నట్లు న్యూరాలజీ వైద్యులు తెలిపారు.

భయపడాల్సిన పనిలేదు...

ఆదివారం చోటు చేసుకున్నది తొలి మరణమేమీ కాదని... గత ఏడాదిలో ఈ ఆస్పత్రిలోనే నలుగురు వ్యాధి బాధితులు మృతి చెందినట్లు చెబుతున్నారు. ఖరీదైన వైద్యం అవసరమే తప్ప భయపడాల్సిన పని లేదని వైద్యులు పేర్కొన్నారు. లక్షణాలు గుర్తించిన వెంటనే ఆస్పత్రికి రావాల్సిందిగా సూచిస్తున్నారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిలో గిద్దలూరుకు చెందిన కమలమ్మ మృతి చెందిది. కాగా, నరసరావుపేటకు చెందిన మరో మహిళ వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. మరో ముగ్గురిలో ఇద్దరు గుంటూరు జిల్లాకు చెందిన వారు. వీరి పరిస్థితి నిలకడగా ఉందని న్యూరాలజిస్టులు వెల్లడించారు.

నెలకు 10 నుంచి 15 కేసులు

న్యూరాలజీ వైద్య విభాగానికి ప్రతి నెల 10 నుంచి 15 జీబీ సిండ్రోమ్ కేసులు వస్తూనే ఉన్నాయి. ఒక్కో పేషెంట్‌కు ఖరీదైన ఇమ్యూనో గ్లోబిన్ ఇంజక్షన్లు ఇవ్వాల్సి వస్తోంది. గత ఏడాది మార్చి నుంచి ఇప్పటి వరకు జీజీహెచ్‌లో 115 మంది చికిత్స పొందారు. కాగా వీరిలో 66 మందికి మాత్రమే ఇంట్రావీనస్ ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్లు చేయడం ద్వారా వ్యాధి నుంచి కోలుకున్నారు. ఇతరులు సాధారణ వైద్యం ద్వారానే రికవరీ అయినట్లు న్యూరాలజిస్టులు చెబుతున్నారు. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉన్న వారికి మాత్రమే ఇంజక్షన్లు అవసరం వస్తుందని తెలిపారు. ఒక్కో ఇంజక్షన్ రూ. 50 వేల వరకు ఉంటుందన్నారు. బాధితుల్లో 20 శాతం మందికి మాత్రమే ఈ ఇంజక్షన్లు చేయాల్సి వస్తోందని తెలిపారు. చికిత్స పొందుతున్న వారిలో కేవలం 5 నుంచి 7.5 శాతం మంది మాత్రమే మరణించే అవకాశాలు ఉన్నాయని పేర్కొంటున్నారు.

ఎలా వస్తుందంటే..

వయస్సుతో సంబంధం లేకుండా ఆడ, మగ తేడా లేకుండా జీబీ సిండ్రోమ్ అందరికి సోకుతుంది. ఇది అంటు వ్యాధి మాత్రం కాదు. 25 శాతం మందికి ఈ వ్యాధి సోకడానికి కారణాలు తెలియదు. 20 శాతం మందికి దగ్గు, జలుబు వంటి వైరల్ ఇన్‌ఫెక్షన్లు, రిస్పిరేటరీ ఇన్‌ఫెక్షన్‌ల వల్ల సోకుతోంది. గ్యాస్ట్రో ఎంట్రిటీస్ (జీఈ) ఇన్‌ఫెక్షన్ వల్ల, డయేరియా వల్ల కూడా వస్తోంది. కాళ్లు, చేతులు చచ్చుబడిపోవడం వ్యాధి సోకిన వారిలో కనిపించే ప్రధాన లక్షణం. వ్యాధి నరాలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. తొలుత కాళ్లకు వ్యాధి సోకి తద్వారా శరీరం పై భాగానికి ఎగబాకుతుంది. వ్యాధి నుంచి కొంత మంది గంటల వ్యవధిలోనే కోలుకోవచ్చు. మరికొంత మందికి నెలల సమయం పడుతుంది. జ్వరం, విరేచనాలు, దగ్గు, జలుబు వచ్చి తగ్గుతున్న సమయంలో వారికి కాళ్లల్లో, చేతుల్లో తిమ్మిర్లు ప్రారంభమై కాళ్లు బలహీనపడితే దీనిని జీబీ సిండ్రోమ్‌గా గుర్తించాలి. తక్షణమే న్యూరాలజిస్టులను సంప్రదించాలి.

పక్కాగా చెక్కేసే పన్నాగం!

- కుటుంబంతో విదేశాలకు పారిపోయేందుకు పుల్లారావు వ్యూహం
- గత ఏడాది డిసెంబర్‌లోనే పాస్‌పోర్టుల రెన్యువల్
- కుమారుడి వివాహం అనంతరం గుట్టుగా తప్పించుకునేందుకు యత్నాలు
- నేరాల చిట్టా బయటపడ్డాక అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసిన ఘనుడు
- ఇప్పుడు పోలీసుల ముందుకు వచ్చేందుకు ఇదే స్కెచ్ అమలు

పట్టుమని పదవ తరగతి కూడా పూర్తి కాలేదు.. కానీ వందల మందిని ఎలా ముంచాలో మాత్రం నేర్చుకున్నాడు.. లెక్కలు అంతగా చదువుకోలేదు.. కానీ ఎంత కూడబెట్టాలో, ఎంత దోచుకోవాలనే విషయంలో మాస్టర్ చేశాడు.. చట్టాలంటే ఏమిటో కూడా తెలియదు.. కానీ ఆ చట్టాల్లో ఉన్న లొసుగులను ఎలా వినియోగించుకోవాలో బాగా తెలుసుకున్నాడు. ఇదీ పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన ఆర్థిక నేరగాడు పుల్లారావు భాగోతం. ఏడవ తరగతి చదివిన పుల్లారావు వ్యవస్థలను మేనేజ్ చేస్తూ తనను నమ్మి డబ్బులిచ్చిన వారిని ముంచేసి పక్కాగా విదేశాలకు చెక్కేసే పన్నాగం వేశాడు.. దీనికి ముందే గుట్టు రట్టవడంతో కోర్టులో లొంగిపోయాడు.



ఇటీవల ఎమ్మెల్యే చదలవాడ అరవిందబాబు కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న పుల్లారావు బాధితులు (ఫైల్)

నరసరావుపేట టౌన్: కొద్దిరోజులుగా రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారిన ఆర్థిక నేరగాడు పాలడుగు పుల్లారావు కేసును పరిశీలించే కొద్దీ విస్తుపోయే నిజాలు వెల్లడవుతున్నాయి. ఉమ్మడి గుంటూరు జిల్లాలతోపాటు తెలంగాణ, విదేశాల్లో ఉన్న వారు సైతం సాయిసాధన చిట్‌ఫండ్‌లో సభ్యులుగా ఉన్నారు. ఈ క్రమంలో అనేకమందిని నమ్మించి వంచించాడు. మరి కొంత మందికి వడ్డీ ఆశచూపి నిండా ముంచాడు. దాదాపు రూ.400 కోట్ల స్కామ్‌కు పాల్పడ్డాడు.

విదేశాలకు వెళ్లేందుకు స్కెచ్..

పల్నాడు జిల్లా నరసరావుపేటకు చెందిన పుల్లారావు గుంటూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న మహి అగ్రి సంస్థ డైరెక్టర్ దండా రాజ్యలక్ష్మి వద్ద విజయలక్ష్మీ టౌన్‌షిప్ వెంచర్‌లో రూ.11.62 కోట్లు పెట్టుబడి పెట్టించాడు. తీసుకున్న నగదుకు వాటా ఇస్తానని నమ్మబలికాడు. అయితే నెలలు గడుస్తున్నా పుల్లారావు వాటా ఇవ్వకపోవడంతో జరిగిన మోసంపై బాధితురాలు పోలీసులను ఆశ్రయించారు. దీంతో పుల్లారావు ఆర్థిక నేర ప్రపంచంలోని బాగోతాలు ఒక్కొక్కొటిగా బయటపడుతూ వచ్చాయి. ప్రజల వద్ద నుంచి సేకరించిన డబ్బుతో కొన్ని నెలలుగా బినామీ పేర్లతో ఆస్తులు కొన్నాడు. బంగారం, వజ్రాల రూపంలో నగదును దారి మళ్లించాడు. చీటీ పాటలు రిజిస్ట్రేషన్ శాఖ అనుమతులు లేకుండానే ఐదేళ్లుగా అక్రమంగా నిర్వహిస్తున్నాడు. అయితే ఈ స్కామ్ బయట పడక ముందే పుల్లారావు విదేశాలకు పారిపోయేందుకు పక్కా స్కెచ్ వేశాడు. గత ఏడాది డిసెంబర్ నెలలోనే తనతో పాటు కుటుంబ సభ్యుల పాస్ పోర్టులన్నీ రెన్యువల్ చేయించాడు. ఫిబ్రవరిలో తన కుమారుడి వివాహం జరిపించి, దర్జాగా ప్రజల సొమ్ము తీసుకుని ఎంచక్కా విదేశాల్లో స్థిరపడాలని పన్నాగం వేశాడు. ఇది బెడిసికొట్టడంతో కోర్టులో లొంగిపోయాడు.

లాయరు లేదంట.. రాలేదంట!

గుంటూరు సబ్‌జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న పుల్లారావును నరసరావుపేట వన్‌టౌన్ పోలీసులు కస్టడీకి ఇవ్వాలని కోరినప్పటికీ చట్టంలోని లొసుగులను తనకు అనుకూలంగా మలుచుకుంటున్నాడు. ఇప్పటి వరకు తాను లాయర్‌ను నియమించుకోలేదనే సాకు చూపుతూ పోలీసు కస్టడీకి రాకుండా తాత్సారం చేస్తున్నాడు. ఈ క్రమంలో తనవద్దకు వచ్చిన బాధితుల వద్ద మొసలి కన్నీరు కారుస్తూ వారిని మరింతగా ముంచేందుకు ఎత్తులు వేస్తున్నాడు. తన వద్ద అప్పులకంటే ఆస్తులు ఎక్కువగా ఉన్నాయని వారిని మేనేజ్ చేసేందుకు ప్రయత్నిస్తున్నాడు. రాష్ట్రంలో సుమారు రూ.400 కోట్లకుపై స్కామ్ జరిగితే కనీసం రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకుని, బాధితుల వైపు నిలబడాల్సిందిపోయి పట్టించుకోవడం లేదని ప్రజలు మండిపడుతున్నారు.

బాధితుల ఆవేదన..

ఇళ్లు, వాకిళ్లు అమ్మేసి.. పిల్లల పెళ్లిళ్లు, చదువుల కోసం పుల్లారావు వద్ద దాచుకున్న సొమ్ము వస్తుందో లేదో అని బాధితులు ప్రతి రోజూ దిగులుతో కన్నీళ్లు కారుస్తున్నారు. ఇప్పటికే ఇన్‌చార్జి మంత్రి, నరసరావుపేట ఎంపీ, ఎమ్మెల్యేలతో పాటు ఐజీ, ఎస్పీలను కలిసి న్యాయం చేయాలంటూ మొరపెట్టుకున్నారు. బాధితులంతా రోడ్డెక్కినా న్యాయం చేయాలని వేడుకుంటున్నా ప్రభుత్వం మాత్రం ఆర్థిక నేరగాడు పుల్లారావుపై ఎందుకు కఠిన చర్యలు తీసుకోవడం లేదనే ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వం కల్పించుకుని తమకు న్యాయం చేయాలని బాధితులు వేడుకుంటున్నారు.

అన్ని వ్యవస్థలూ తన గుప్పిట్లోనే..

పోలీసుల దగ్గర నుంచి అన్ని వ్యవస్థలను పుల్లారావు తన చేతుల్లో పెట్టుకున్నాడు. తన ఆర్థిక నేర ప్రపంచం గురించి బయటకు తెలిసినప్పటికీ ఎంచక్కా దర్జాగా కొడుకు పెళ్లి వేడుకలు నిర్వహించాడు. తాను అనుకున్నప్పుడే కోర్టులో లొంగిపోయాడు. దీని వెనుక తన సమీప బంధువైన సీఐ ప్రమేయం ఉందని బాధితులు గగ్గోలు పెడుతున్నా.. కూటమి ప్రభుత్వం కనీసం ఆ సీఐపై చర్యలు తీసుకున్న పాపాన పోలేదు. పోలీసులు అతన్ని అరెస్ట్ చేసే సాహసం చేయలేకపోయారు. దీన్ని బట్టి పుల్లారావు ఏ స్థాయిలో పోలీసు వ్యవస్థను మేనేజ్ చేశాడో అర్థమవుతుంది.

రాజీమార్గం ద్వారా పరిష్కరించుకుందాం

- న్యాయం జరగని పక్షంలో ఉద్యమం ఉధృతం చేద్దాం
- సమావేశంలో తీర్మానించుకున్న పుల్లారావు బాధితులు

నరసరావుపేటటౌన్ : రాజీ మార్గం ద్వారా సమస్య పరిష్కరించుకుందామని పుల్లారావు బాధిత సంఘ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం కమ్మ హాస్టల్లో సాయిసాధన చిట్‌ఫండ్ బాధితులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు బాధితులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. పుల్లారావుపై నమోదైన చిట్‌ఫండ్ క్యాంపు కేసు సీఐడీకి బదిలీ చేస్తే న్యాయం జరగటంలో ఆలస్యం జరుగుతుందన్నారు. పుల్లారావు తరఫున మధ్యవర్తిత్వం వహించేందుకు కొందరు ముందుకు వస్తున్నారు కాబట్టి బాధితుల తరఫున కమిటీగా ఏర్పడ్డ సభ్యులు వారితో చర్చించి సమస్య పరిష్కారానికి దారి చూపాలన్నారు. సమస్య పరిష్కారం కాని పక్షంలో ఐక్యంగా కలిసి పోరాడుదాం అన్నారు. జరిగిన మోసాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకువెళ్లి న్యాయం జరిగేవరకు ఆందోళనలు చేద్దామని తీర్మానించారు. కార్యక్రమంలో నాగోతు శౌరయ్య, కడియాల రమేష్, ఇ.ఎం.స్వామి, వి.మధుసూధనరావు పాల్గొన్నారు.

వారమే సమయం.. నత్తేనయం!

తిరునాళ్ల పనుల్లో కనిపించని పురోగతి

- 23 నుంచి కోటప్పకొండ తిరునాళ్ల మహోత్సవం
- కొండ దిగువున పనులు ప్రారంభించని పలు శాఖలు
- ఏర్పాట్లలో ప్రధాన శాఖల నిర్లక్ష్య వైఖరి
- ఆలయంలోనూ కొనసా..గుతున్న పనులు

నరసరావుపేట రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఈనెల 26వ తేదీన కోటప్పకొండలో నిర్వహించే తిరునాళ్ల మహోత్సవానికి వారం రోజులే సమయం ఉంది. ఏకాదశి ముందురోజు ఆదివారం కావడంతో ఈనెల 23 నుంచే కోటప్ప కొండకు భక్తుల రాక ప్రారంభమవుతుంది. తిరునాళ్ల ఏర్పాట్లపై నెలరోజుల నుంచి సమీక్షా సమావేశాలు నిర్వహిస్తున్నా కీలకమైన శాఖలు ఇప్పటివరకు పనులు ప్రారంభించలేదు. ఆలయ ప్రాంగణంలో రంగులు వేసే పనే ఇంకా ఒక కొలిక్కి రాలేదు. కొండ దిగువున బారికేడింగ్, లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు వంటి పనులపై అధికారులు ఇప్పటివరకు దృష్టిపెట్టలేదు. కొండకు వచ్చే రహదారుల్లో మరమ్మతులు ఇప్పటివరకు ప్రారంభించలేదు.

దగ్గర పడుతున్నా చలనం ఏదీ..?

కోటప్పకొండ తిరునాళ్లకు వచ్చే లక్షలాది మంది యాత్రికుల కోసం ప్రభుత్వ శాఖలు విస్తృత ఏర్పాట్లు చేయాల్సి ఉంది. ఇందుకోసం నెలరోజుల నుంచే జిల్లా అధికారులతో పలుమార్లు సమీక్షా సమావేశాలు నిర్వహించారు. శాఖల వారీగా చేపట్టాల్సిన పనులపై దిశానిర్దేశం చేశారు. అయితే తిరునాళ్లకు సమయం దగ్గర పడుతున్నా పలు శాఖల్లో చలనం కనిపించడం లేదు. కొండ దిగువున శివరాత్రి రోజు రాత్రి జాతరకే లక్షలాది మంది తరలివస్తారు. ఈ ప్రాంతంలో యాత్రికులకు అసౌకర్యం కలగకుండా పనులు చేపట్టాల్సి ఉంది. కొండ దిగువున ప్రధాన రహదారి వెంట బారికేడ్లు ఏర్పాటు చేసే పనిని ఆర్అండ్‌బీ నిర్వహించాల్సి ఉంది. ఈ పనులు ఇంకా ప్రారంభించలేదు. ప్రధాన రహదారులతో పాటు భక్తులు స్నానాలు ఆచరించే చిలకలూరిపేట మేజర్ కాలువ వద్ద విద్యుత్‌దీపాలు ఏర్పాటు చేయాలి, ఆర్అండ్‌బీ (ఎలక్ట్రికల్) శాఖ దీనిని చేపటాల్సి ఉండగా పనులు ప్రారంభం కాలేదు. యాత్రికులకు తాగునీటి సమస్య తలెత్తకుండా నీటి కుళాయిలు ఏర్పాటుతో తాత్కాలిక మరుగుదొడ్లను ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ నిర్వహిస్తోంది. ఆయా పనుల్లో పురోగతి కనిపించడం లేదు. ప్రభుత్వ శాఖల స్టాల్స్, పోలీసు ఉన్నతాధికారుల తాత్కాలిక వసతి కోసం సిద్ధం చేసే మైదానాన్ని ఇప్పటివరకు శుభ్రం చేయకపోవడంతో పిచ్చిమొక్కలతో దర్శనమిస్తుంది.



కోటప్పకొండ ఆలయ ప్రాంగణంలో ఇంకా కొలిక్కిరాని పనులు



పిచ్చిమొక్కలతో నిండిన కొండ కింద స్టాల్స్, తాత్కాలిక వసతి ఏర్పాటు ప్రాంతం

రహదారుల పరిస్థితి ఇంతేనా..?

కొండకు చేరే ప్రధాన రహదారులతో పాటు లింక్‌రోడ్లను తిరునాళ్ల కోసం సిద్ధం చేయాల్సి ఉండగా ఆ పనులను ఇప్పటి వరకు చేపట్టలేదు. కోటప్పకొండ – కొత్తపాలెం రహదారి మెటల్ బయటపడి అధ్వానంగా ఉంది. కోటప్పకొండ నుంచి పెట్లూరివారిపాలెం కాలువ రహదారి గోతుల మయంగా మారింది. అలాగే గురవాయపాలెం – ఉప్పలపాడు రోడ్డు గోతులతో నిండిపోయింది. తిరునాళ్లలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ఉండాలంటే ప్రధానంగా రోడ్ల మరమ్మతులు చేపట్టాల్సి ఉన్నా అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోకపోవడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



అధ్వానంగా చిలకలూరిపేట మేజర్ కెనాల్ రోడ్డు

ఆలయ ప్రాంగణంలో పరిస్థితి..

కొండ మీద ప్రధానాలయం కాకుండా ఇతర ఆలయాలకు రంగులు వేసే పనిని నెల రోజుల క్రితం ప్రారంభించారు. ఈ పనులు ఇంకా సాగుతున్నాయి. క్యూలైన్‌లకు మరమ్మతులు చేపట్టి రంగులు వేయడం పూర్తయింది. ఆలయ ప్రాంగణంలోని ఆర్చీకి రంగులు వేస్తున్నారు. పార్కింగ్ ప్రాంతంలో ఉన్న క్యూలైన్‌లకు తాటాకు పందిరి ఏర్పాటు చేస్తున్నారు.

20వ తేదీ నాటికి ఆలయంలో పనులు పూర్తి

ఈనెల 23వ తేదీ ఆదివారం నుంచే భక్తుల తాకిడి ఉంటుందని భావిస్తున్నాం. అందుకు తగ్గట్టు ఆలయంలో చేపట్టిన పనులు 20వ తేదీకి పూర్తిచేయాలని నిర్ణయించాం. రంగులు వేసే పని మూడు రోజుల్లో పూర్తవుతుంది. ప్రసాదాలు తయారీని ప్రారంభించాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం.

– డి.చంద్రశేఖరరావు, ఆలయ ఈఓ.

క్లుప్తంగా

ముగిసిన నాటిక పోటీలు



నరసరావుపేట ఈస్ట్: నరసరావుపేట రంగస్థలి, ఆంధ్రప్రదేశ్ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయస్థాయి ఆహ్వాన తెలుగు నాటిక పోటీలు ముగిశాయి. చివరి రోజైన ఆదివారం నాటిక పోటీలను మద్ది లక్ష్మీశ్వేతా కిషోర్ జ్యోతి ప్రజ్వలన నిర్వహించి ప్రారంభించారు. కాకినాడ జి.వి.కె.క్రియేషన్స్ వారి తితిక్ష, గుంటూరు అమరావతి ఆర్ట్స్ వారి చిగురు మేఘం నాటికలు ప్రదర్శించారు. మాదక ద్రవ్యాలు సమాజాన్ని నాశనం చేస్తుంటే గంజాయి సరఫరా చేసే కన్న కొడుకునే కడతేర్చి గంజాయి భూతాన్ని తరిమి కొట్టాలనే కన్నతల్లి ప్రయత్నమే కథాంశంగా తితిక్ష నాటిక ప్రేక్షకులను ఆకట్టుకుంది. డబ్బు సంపాదనే లక్ష్యంగా మారి వైద్యాన్ని అమ్ముకుంటున్న డాక్టర్ తన తప్పు తెలుసుకొని పేదలకు వైద్యం అందించేందుకు గ్రామ బాట పట్టడం ఇతివృత్తంగా చిగురు మేఘం ప్రేక్షకుల మన్ననలు పొందింది. కాగా, శనివారం రాత్రి నాటిక పోటీలకు హాజరైన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ, నాటక రంగాన్ని భావి తరాలకు అందించాలని కళాకారులను కోరారు.

సత్తా చాటిన నరసరావుపేట

కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో చాంపియన్ షిప్ పోటీల్లో విజేత



అద్దంకి రూరల్: స్థానిక గీతామందిరంలో ఆదివారం జాతీయ స్థాయి ఓపెన్ కరాటే, కుంగ్‌ఫూ, తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు ఉత్సాహంగా జరిగాయి. 6 రాష్ట్రాల నుంచి 650 మంది పాల్గొనగా.. నరసరావుపేట టీం విజయం సాధించింది. పోటీల చీఫ్ ఆర్గనైజర్ పి.రాంబాబు మాట్లాడుతూ సొంత ఊరికి పేరు తేవాలని కోరికతోనే అద్దంకిలో నిర్వహించినట్లు తెలిపారు. ఆల్ ఇండియా ప్రెసిడెంట్ సాయిరాం విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, చిన్ని మురళీ కృష్ణ, చిన్ని శ్రీనివాసరావు, పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి, మలాది శ్రీనివాసరావు, కరాటే మాస్టర్ వెంకట రత్నం పాల్గొన్నారు.

ఉత్సాహంగా డాక్టర్స్ క్రికెట్ పోటీలు

పెదకాకాని: డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలు ఆదివారం ఉత్సాహభరితంగా సాగాయి. నంబూరులోని డీఎస్‌ఏ క్రికెట్ క్రీడా ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఉమ్మడి గుంటూరు జిల్లాల పోటీల్లో వైద్యులు పాల్గొని ఉత్సాహంగా ఆడారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ వైద్య వృత్తిలో నిత్యం ఒత్తిడి, ఆందోళన ఉంటాయని, వాటిని తట్టుకునేందుకు క్రీడా పోటీలు దోహదం చేస్తాయని తెలిపారు. పోటీల్లో బ్రింద బ్రెయిన్ – ఎ 1 ఎవన్జర్స్, ఐకాన్–జీబీఆర్, టైమ్ పాస్ టిల్లు – శ్రీ టీమ్‌లు పోటీ పడ్డాయి. ఎ1 ఎవన్‌జర్స్, జీబీఆర్, శ్రీ టీమ్ విజేతలుగా నిలిచాయి. ఫైనల్స్‌కు చేరిన శ్రీటీమ్ అమృత టీమ్‌తో పోటీపడగా శ్రీటీమ్ విజయం సాధించింది. టీమ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిమ్మకాయల పృథ్వీరాజ్, బెస్ట్ బౌలర్‌గా పృథ్వి ట్రోఫీలను అందుకున్నారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజినీరింగ్ ఆఫ్ పోలవరం ప్రాజెక్ట్ జి. శివకుమార్‌రెడ్డి, డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ టి.ఎస్. రెడ్డి, డాక్టర్ అవుల శ్రీనివాసరావు, వైద్యులు దావులూరి రమేష్, సందీప్ వెల్లా, దాట్ల శ్రీనివాసరెడ్డి, జాన్ షహీద్, ఎండీ. అస్లం, ప్రదీప్ కుమార్ పాల్గొన్నారు.

డాక్టర్ నాగూర్‌బాషాకు 'బెస్ట్ బ్యాట్స్‌మెన్'

గుంటూరు మెడికల్ : గుంటూరు జీజీహెచ్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ షేక్ నాగూర్‌బాషా క్రికెట్ పోటీల్లో బెస్ట్ బ్యాట్స్‌మేన్ అవార్డును ఆదివారం అందుకున్నారు. డాక్టర్స్ స్పోర్ట్స్ కల్చర్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈనెల 12 నుంచి నంబూరులోని డీఎస్‌ఏ క్రికెట్ క్రీడా ప్రాంగణంలో ఉమ్మడి గుంటూరు జిల్లా వైద్యుల క్రికెట్ పోటీలు జరుగుతున్నాయి. లీగ్ మ్యాచ్‌లలో 53 బంతులకు 46 రన్స్ చేసి బ్యాటింగ్‌లో ఉత్తమ ప్రతిభ చూపినందుకు డాక్టర్ నాగూర్‌బాషాకు బెస్ట్ బ్యాట్స్‌మెన్ అవార్డు లభించింది.

ప్రజాప్రతినిధులకు గ్రామాల్లో తిరిగే హక్కులేదా?

- పెదకూరపాడు జెడ్పీటీసీ భర్త శివాజీపై టీడీపీ నేతలు దాడిచేయడం దారుణం
- అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ మండలాల జెడ్పీటీసీ సభ్యులు

అచ్చంపేట: ప్రజాస్వామ్యబద్ధంగా జరిగిన ఎన్నికలలో గెలుపొందిన ప్రజాప్రతినిధులకు వారి వారి మండలాల్లో తిరిగే హక్కులేదా? తిరిగితే దాడులుచేసి, తప్పుడు కేసులు బనాయిస్తారా? ప్రజాస్వామ్యం అంటే ఇదేనా అని నియోజకవర్గంలోని ఐదు మండలాల జెడ్పీటీసీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఈ సందర్భంగా వారు పెదకూరపాడు మండలంలోని గారపాడు ఆంజనేయస్వామి దేవాలయానికి వెళ్లిన పెదకూరపాడు జెడ్పీటీసీ కంకణాల స్వర్ణకుమారి భర్త కంకణాల శివాజీపై టీడీపీ నేతలు, కార్యకర్తలు దాడులకు పాల్పడడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. న్యాయబద్ధంగా గెలిచిన తాము ప్రజల్లో తిరగకూడదా ..గతంలో ఎప్పుడైనా ఇలాంటి పరిస్థితులున్నాయా అని ప్రశ్నించారు. ఇంత జరుగుతున్నా ప్రేక్షకుల్లా మారిపోయిన పోలీసులు తమపైనే తప్పుడు కేసులు పెట్టడం అన్యాయమన్నారు. ప్రజాస్వామ్యంలో న్యాయాన్యాయాలను విచారించాలని, ఎవరో ఏదో తప్పుడు ఫిర్యాదుచేస్తే దాన్ని ఆసరాగా తీసుకుని తప్పుడు కేసులు బనాయించడం సరికాదన్నారు. తాము ఇచ్చే ఫిర్యాదులుగాని, తాము చేప్పేదిగాని పట్టించుకోకపోవడం ఖచ్చితంగా వివక్ష చూపడమేనన్నారు. పోలీసులు శాంతిభద్రతలు కాపాడేలే తప్ప గొడవలు సృష్టించడం, తప్పుడు కేసులు బనాయించడం ఎంతవరకు సమంజసమన్నారు? అధికారంలోకి వచ్చిన పార్టీవారు ఎవరైనా సరే ప్రజలకు ఏవిధంగా మేలు చేయాలి, ఇచ్చిన హామీలను ఎంతవరకు నెరవేరుస్తున్నాం, ఎలాంటి అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలి అనేదానిపై దృష్టిపెట్టాలిగానీ, ఎవరిపై దాడులు చేద్దాం, ఎంతమందిపై తప్పుడు కేసులు బనాయించి జైలుకు పంపుదాం అనే విధంగా ప్రవర్తించడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా తప్పుడు కేసులను విరమించుకుని, దాడులకు స్వస్తి చెప్పి ప్రజాభివృద్ధి కోసం పాలన కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట, అమరావతి, క్రోసూరు, బెల్లంకొండ మండలాల జడ్పీటీసీ సభ్యులు తుమ్మా విజయప్రతాప్ రెడ్డి, కరుణకుమారి, షేక్ జమీల్, గాదె వెంకటరెడ్డిలతో పాటు జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యులు షేక్ సర్దార్ షమి తదితరులున్నారు.

పండ్ల వ్యాపారి హత్య



రబ్బాని మృతదేహాన్ని పరిశీలిస్తున్న సీఐ రమేష్‌బాబు, ప్రకాశరావు

తెనాలి రూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో పండ్ల వ్యాపారి హత్యకు గురైన ఘటన ఆదివారం సాయంత్రం తెనాలిలో చోటుచేసుకుంది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన షేక్ రబ్బాని(36) చెంచుపేట డొంక రోడ్డు వద్ద పండ్లు విక్రయిస్తుంటాడు. అతడి మేనకోడలు కరీమాను పినపాడుకు చెందిన షేక్ గౌస్‌బాజీకి వచ్చి వివాహం చేశారు. దంపతుల మధ్య గొడవలు జరుగుతున్న క్రమంలో మేనకోడలికి రబ్బాని మద్దతుగా నిలుస్తున్నాడు. ఇది మనసులో పెట్టుకున్న గౌస్‌బాజీ రబ్బానీని అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఆదివారం సాయంత్రం కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపర్చాడు. స్థానికులు అతన్ని తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, ఎస్‌ఐ ప్రకాశరావు వైద్యశాలకు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విక్రయాలు బక్క చిక్కేన్!



వినుకొండ రోడ్డులో వినియోగదారులు లేక వెలవెలబోతున్న ఓ చికెన్ దుకాణం



వినుకొండ రోడ్డులో కొనుగోలుదారులతో కళకళలాడుతున్న చేపల వ్యాపారం

- బర్డ్‌ఫ్లూ భయంతో చికెన్ దుకాలు వెలవెల
- మటన్, చేపలు, రొయ్యలవైపునకు మళ్లిన మాంసం ప్రియులు

నరసరావుపేట: రాష్ట్రంలోని పలు జిల్లాల్లో బర్డ్ ఫ్లూ వ్యాధితో లక్షలాది కోళ్లు చనిపోవడం, ఆయా జిల్లాల్లో చికెన్, గుడ్ల విక్రయాలు నిలిపేయడం, జనంలో నెలకొన్న భయాందోళనలు వెరసి వీటన్నిటి ప్రభావం జిల్లాలోని చికెన్ విక్రయాలపై పడింది. జిల్లాలో ఎక్కడా బర్డ్‌ఫ్లూ లేదని, 100 డిగ్రీల మంటపై వండిన చికెన్‌ను తినవచ్చని పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రకటించినా ప్రజలు పట్టించుకోలేదు. ఈ ఆదివారం కొద్ది బేరం తప్పితే చికెన్‌షాపులు అన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. అయితే మటన్, చేపలు, రొయ్యలు విక్రయించే దుకాణాలు మాంసం ప్రియులతో కిటకిటలాడాయి. పట్టణ పరిధిలోని వినుకొండ రోడ్డు, కలెక్టరేట్ రోడ్డు, పల్నాడు రోడ్డు, సత్తెనపల్లి రోడ్డు, గుంటూరు రోడ్డు, మాంసం మార్కెట్, మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న చికెన్ దుకాణాలు వెలవెలబోవగా, ఆ పక్కనే ఉన్న మటన్ దుకాణాలు, మినీ వ్యాన్‌లలో చేపలు విక్రయించే మినీ వ్యాన్‌ల వద్ద జనం రద్దీ కనిపించింది. ప్రజల్లో బర్డ్‌ఫ్లూ భయాందోళనలు నెలకొన్నా.. చికెన్ ధరలు స్వల్పంగానే తగ్గడం గమనార్హం. గత ఆదివారం కేజీ రూ.260కు విక్రయించిన వ్యాపారులు ఈ ఆదివారం స్కిన్‌తో రూ.220, స్కిన్‌లెస్ రూ.240లని బోర్డులు వేలాడ దీశారు. మటన్ కేజీ రూ.900లకు విక్రయించగా, చేపలు రాగండి కిలో రూ.180, బొచ్చె రూ.220, కొరమేను రూ.500కు విక్రయించారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



పిడుగురాళ్ల: మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పిడుగురాళ్ల ఎస్‌ఐ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. బ్రాహ్మణపల్లి గ్రామంలోని ప్రధాన రహదారి పక్కనే ఉన్న మసీదు ఎదురు సిమెంట్ బెంచీ మీద గుర్తు తెలియని సుమారు 35 సంవత్సరాల వయస్సు కలిగిన వ్యక్తి మృతి చెంది ఉన్నాడని గుర్తించామన్నారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి వివరాలు సేకరిస్తున్నట్లు ఆయన తెలిపారు.

వెంకన్నకుంటలో గుర్తు తెలియని మహిళ...

వెల్దుర్తి: మండలంలోని మిట్టమీదిపల్లె గ్రామ సమీపంలోని వెంకన్న కుంటలో ఆదివారం సుమారు 30 నుంచి 40సంవత్సరాలలోపు ఉండే గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ సమందర్ వలి తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని మిట్టమీది పల్లె గ్రామం వద్ద నీటి కుంటలో మహిళ మృతదేహం తేలాడుతుందనే గ్రామస్తుల సమాచారం మేరకు సంఘటనా స్థలానికి వెళ్లి నీటి కుంటలో ఉన్న మహిళ మృతదేహాన్ని వెలుపలకు తీసి పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. మృతురాలి మెడలో పసుపు కొమ్ము, పసుపు తాడు, కాలికి రాగి మెట్టెలు ఉన్నట్లు తెలిపారు. ఈ మహిళ మూడు రోజుల కిందట ఈ కుంటలో పడినట్లు గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. మహిళ ఆచూకీ తెలిసిన వారుంటే వెంటనే వెల్దుర్తి పోలీసు స్టేషన్‌కు సమాచారమివ్వాలని ఎస్‌ఐ సమందర్ వలి కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యవసాయ కూలీ..



సంఘటన ప్రాంతంలో మృతిచెందిన చిన్న

బొల్లాపల్లి: మిరప కోతకు వచ్చిన కూలీ రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన సంఘటన మండలంలోని రావులాపురం – రేమిడిచర్ల గ్రామాల మధ్య ఆదివారం సాయంత్రం జరిగింది. బండ్లమోటు పోలీసులు, ఆయా గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా నల్గొండ పట్టణంలోని నల్లదిబ్బల పల్లెకు చెందిన పల్లపు చిన్న (25) మండలంలోని గుమ్మనంపాడు గ్రామంలో తన కుటుంబ సభ్యులతో కలిసి మిరప కాయల కోత కూలికి వచ్చాడు. తన ద్విచక్ర వాహనంపై గుమ్మనంపాడు నుంచి రాజులపాలెం వెళ్తుండగా మార్గ మధ్యంలో గుర్తుతెలియని వాహనం ఎదురెదురుగా వచ్చి ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో చిన్న అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుని తల్లి పల్లపు మంగమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బండ్లమోటు ఎస్‌ఐ ఎ.బాలకృష్ణ తెలిపారు. మృతుడికి భార్య స్వాతి, ఒక కుమారుడు కలరు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఇదిలా ఉండగా.. రోడ్డు ప్రమాదానికి సంబంధించి యువకుడు మృతిచెందిన సంఘటన ప్రాంతంలో మండలంలో రెండు బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే వాహనానికి చెందిన నంబరు ప్లేట్ పడి ఉన్నట్లు గ్రామస్తులు చెబుతున్నారు. ఈ ప్రమాదానికి కారణం బెల్టు షాపులకు మద్యం సరఫరా చేసే వాహనం అయి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

పట్నంబజారు: ద్విచక్ర వాహనంపై అతి వేగంగా వెళుతూ డివైడర్‌ను ఢీకొట్టి యువకుడు మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. వెస్ట్ ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బాపట్ల జిల్లా చినగంజాం గ్రామానికి చెందిన చింతా రాము (19) కొత్తపేటలోని కుగ్లర్ ఆసుపత్రి వద్ద నివాసం ఉంటున్నాడు. అదే ప్రాంతంలో ఒక ప్రైవేటు ల్యాబ్‌లో డెలివరీ బోయ్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం అరండల్‌పేటలో పని నిమిత్తం వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో ప్రధాన రహదారిపై డివైడర్‌ను ఢీకొన్నాడు. అతి వేగంగా ప్రయాణిస్తుండటంతో డివైడర్‌పై ఉన్న ఇనుప చువ్వలపై పడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుని తల్లి కోటేశ్వరమ్మ ఫిర్యాదు మేరకు బాబూరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చీటీ పాటల పేరుతో రూ.15 లక్షలు మోసం

లక్ష్మీపురం: చీటీ పాటల పేరుతో నగదు వసూలు చేసుకుని తిరిగి ఇవ్వకుండా పారిపోయిన నిర్వాహకులపై అరండల్‌పేట పోలీసులు శనివారం అర్ధరాత్రి కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మాలకొండయ్య కాలనీకి చెందిన విజయ లక్ష్మి, ఆమె కుమారుడు అనిల్ చీటీ పాటలు వేస్తుంటారు. తల్లీకొడుకులు ఇద్దరు ఆ ప్రాంతంలో 40 మంది నుంచి రూ.15లక్షలు వసూలు చేసి, ఎవరికీ చెప్పాపెట్టకుండా పారిపోయారు. దీంతో బాధితులు దిక్కుతోచక అరండల్‌పేట పోలీస్ స్టేషన్‌లో శనివారం రాత్రి ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి

పట్నంబజారు: అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి చెందిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాసరావుపేటకు చెందిన అంకాల ప్రత్యూష (23) ఏడాది కిందట ఆనందపేటకు చెందిన అంకాల పవన్ కల్యాణ్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ప్రత్యూష కన్సల్టెన్సీలో ఉద్యోగం చేస్తుంది. పవన్ కల్యాణ్ మార్కెట్‌లో పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మద్యం అలవాటు ఉన్న కల్యాణ్‌తో మృతురాలు ప్రత్యూషకు తరచూ వివాదం జరుగుతుండేది. ఈనెల 15 రాత్రి పవన్ తాగి వచ్చి భార్యతో ఘర్షణ పడ్డాడు. అతడు బయటకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చేసరికి ప్రత్యూష్ ఫ్యానుకు చీరతో ఉరి వేసుకుని కనిపించింది. వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లేసరికి మృతి చెందినట్లు వైద్యులు చెప్పారు. మృతురాలి తల్లి కుమార్తె మృతిపై అనుమానం ఉన్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

సేవాలాల్ జయంతి నిర్వహణలో ప్రభుత్వం విఫలం

ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనునాయక్



యడ్లపాడు సుగాలీ కాలనీలో కేక్ కట్ చేస్తున్న దృశ్యం

యడ్లపాడు: శ్రీ సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయిందని ఏపీ గిరిజన సంఘాల ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు బి.శ్రీనునాయక్ విమర్శించారు. యడ్లపాడు ఎర్రకొండ సమీపన ఉన్న సుగాలీ కాలనీలో ఎస్టీ యూత్ ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమం శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనునాయక్ మాట్లాడుతూ తండాలో జన్మించి నిలువెల్లా సేవాగుణం నిండుకొన్న సంత్ సేవాలాల్ బ్రిటిష్ పాలకులను అడ్డుకున్న ధీశాలి అన్నారు. సేవాలాల్ జయంతిని తెలంగాణ ప్రభుత్వం క్యాజువల్ లీవ్‌గా ప్రకటించగా, తమిళనాడు, కర్ణాటక, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లోనూ జయంతి వేడుకల్ని ఘనంగా నిర్వహించారని, ఇక్కడి కూటమి ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో విఫలమైందన్నారు. ముందుగా కేక్ కట్ చేసి, అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో సుగాలి వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు బాణావతు శ్రీనునాయక్, ముడావతు బాలాజీ నాయక్, హనుమానాయక్, రమావతు శ్రీనునాయక్, అంజినాయక్, దశావతు శంకర్ నాయక్, వెంకట్‌నాయక్, శివకృష్ణ నాయక్, రావూరి దుర్గానాయక్ పాల్గొన్నారు.

గొప్ప పాలకుడు అన వేమారెడ్డి

కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి



విగ్రహావిష్కరణలో పాల్గొన్న గ్రామ ప్రజలు

మేడికొండూరు: మండల పరిధిలోని జంగుగుంట్లపాలెం గ్రామంలో కొండవీటి రెడ్డి రాజు (అన వేమారెడ్డి) విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని ఆదివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కొండవీడు కోట అభివృద్ధి కమిటీ కన్వీనర్ కల్లి శివారెడ్డి మాట్లాడుతూ కొండవీటి సామ్రాజ్యాన్ని పాలించిన పాలకుల్లో అన వేమారెడ్డి సుప్రసిద్ధుడన్నారు. అతని పరిపాలన క్రీ.శ.1364 – 1386 వరకు సాగిందని తెలిపారు. ఈయన పాలనలో కవులు, గాయకులకు ఎంతో ఆదరణ లభించిందని, వారికి అనేక విధాలుగా దానధర్మాలు చేసి కళలను పోషించినట్లు చరిత్ర చెబుతుందన్నారు. అనవేమారెడ్డి కొండవీటి పాలకుల్లోనే కాక ఆంధ్ర దేశాన్ని పాలించిన గొప్ప రాజులలో ఒకడని శివారెడ్డి తెలిపారు. ఈయన కాలంలో దశదిశలా తన దండయాత్ర ద్వారా రాజ్యాన్ని విస్తరింపచేశాడన్నారు. విగ్రహావిష్కరణలో సర్పంచ్ శ్రీదేవి సాంబిరెడ్డి, మెంబర్ సాంబి రెడ్డి, తాళ్లకోటిరెడ్డి, నారసాని జయసూర్య, ఆళ్ల శ్రీనివాసరెడ్డి, ఆళ్ల బాపిరెడ్డి, చిర్రా శ్రీనివాసరెడ్డి, చిర్రా శేషిరెడ్డి పాల్గొన్నారు.

మహిళ హ్యాండ్ బ్యాగ్ చోరీ

లక్ష్మీపురం: మహిళ హ్యాండ్ బ్యాగ్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన ఘటనపై అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. గోరంట్ల గ్రామానికి చెందిన సాయి పూజ ఈనెల 14న అరండల్‌పేట 5/5లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స చేయించుకునేందుకు వచ్చింది. పలు పరీక్షలు చేయించుకునే క్రమంలో మెడలో ఉన్న 20గ్రాముల బంగారు గొలుసును బ్యాగ్‌లో పెట్టుకుంది. రాత్రి 8 గంటల సమయంలో ఇంటికి వెళ్లేందుకు రోడ్డు పైకి వచ్చింది. ఈ సమయంలో గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు ద్విచక్ర వాహనంపై వచ్చి హ్యాండ్ బ్యాగ్‌ను లాక్కొని పరారయ్యారు. దీంతో పూజ కేకలు పెట్టడంతో స్థానికులు పట్టుకునే యత్నం చేసేలోగా పారిపోయారు. సమాచారం తెలుసుకున్న అరండల్‌పేట పోలీసులు ఘటనా స్థలంలో సీసీ కెమెరాలను పరిశీలించారు. బ్యాగ్‌లో ఉన్న 20 గ్రాముల బంగారు గొలుసు, రూ.1500 నగదు, సెల్‌ఫోన్ ఉన్నట్లు బాధితురాలు తెలుకుని శనివారం రాత్రి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది.